క్లుప్తంగా

జేవీఆర్ ఓసీ పీఓ దృష్టికి సమస్యలు


వినతిపత్రం అందజేస్తున్న కిష్టారం గ్రామస్తులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీ పీఓగా బాధ్యతలు తీసుకున్న ప్రహ్లాదను గురువారం కిష్టారం గ్రామ ప్రజలు కలిసి గ్రామ సమస్యలను పీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. గ్రామాన్ని కాలుష్యం నుంచి కాపాడాలని, అంబేడ్కర్ నగర్ దగ్గరగా ఉన్న బంకర్లను తొలగించాలని లేని పక్షంలో బంకర్ల నుంచి సుమారు కిలోమీటర్ వరకు గ్రామాన్ని తరలించాలని కోరారు. గ్రామాన్ని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉడతనేని అప్పారావు, మాజీ సర్పంచ్ చెట్టుమాల రేణుక, పానెం ఈశ్వర్, మాజీ ఉపసర్పంచ్ ధనుంజయరావు, నరుకుళ్ల శేషగిరిరావు, గుడ్లూరి రమణయ్య, భాను పాల్గొన్నారు.

అన్నదానం


భోజనం వడ్డిస్తున్న కృష్ణ ప్రసాద్ దంపతులు

మధిర : పట్టణంలో నిర్వహిస్తున్న మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల కేంద్రంలో గురువారం అన్నదానం నిర్వహించారు. వాసిరెడ్డి బేబీ సరోజిని వర్ధంతి సందర్భంగా ఆమె బంధువులు ఆళ్ల నాగవాహిని, సాయి భార్గవ్ ఆర్థిక సహకారంతో అన్నదానం ఏర్పాటుచేసినట్టు నిర్వాహకులు నల్లపు స్వర్ణలత తెలిపారు. వాసిరెడ్డి కృష్ణ ప్రసాద్, సృజన తదితరులు పాల్గొన్నారు.

ప్రీతమ్‌ను కలిసిన చెన్నయ్య


ప్రీతమ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చెన్నయ్య

కొణిజర్ల: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులై నగరగారి ప్రీతమ్‌ను గురువారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఎస్సీ సెల్ టీపీసీసీ కన్వీనర్ దర్శి చెన్నయ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ప్రీతమ్ సూచించినట్లు తెలిపారు.

కేజీబీవీలో స్పోర్ట్స్ మీట్


విజేతలకు బహుమతులు అందజేత

కారేపల్లి: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఖమ్మం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను గురువారం నిర్వహించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌ను సింగరేణి తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎస్సై ఎన్.రాజారాంలు ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ ఝాన్సీసౌజన్య, యువజన సంఘం అధ్యక్షులు చింతమాల పాపయ్య, పీడీ సీతా, కళ్యాణి, ఎస్‌కే సుల్తాన్ పాల్గొన్నారు.

మహనీయుడు ఠానూనాయక్


ఠానూనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కారేపల్లి: భూస్వాములను ఎదిరించిన ధీశాలి, బంజార జాతి మహనీయుడు జాటోతు ఠానూనాయక్ అని లంబాడి సంస్కృతి పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా రాంకోటి అన్నారు. జాటోతు ఠానూనాయక్ వర్ధంతి సందర్భంగా గురువారం కారేపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన లంబాడీల కోసం ఠానూనాయక్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లంబాడీల ఐక్యవేదిక జిల్లా ఇన్‌చార్జ్ బాలునాయక్, నాయకులు బాణోతు రాములు, ధరావత్ రాంజీ, మూడ్ చిన్నమల్లు నాయక్, గుగులోతు పంతుల్‌నాయక్, బాణోతు శంకర్‌నాయక్, ఆంగోతు కుమార్, ప్రేమ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా తొమ్మిది రోజులే..

ఆస్తిపన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

- రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు
- మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు
- 90 శాతం వడ్డీ మాఫీకి స్పందన


సత్తుపల్లిలో పన్నులు వసూళ్లు చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: మున్సిపాలిటీలకు ప్రధాన ఆదాయ వనరు పన్నులే. ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఇంకా తొమ్మిదిరోజులే గడువు ఉండటంతో సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీల్లో అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యచరణ చేపట్టింది. పెద్దమొత్తంలో పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిల వసూలుకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 31లోగా పన్ను వసూళ్ల లక్ష్యాన్ని పూర్తి చేయాల్సి ఉండటంతో మున్సిపాలిటీలు దృష్టి సారించాయి. వార్డుల వారీగా అత్యధికంగా పన్నులు చెల్లించాల్సిన వ్యక్తుల జాబితాను తయారు చేసి బిల్ కలెక్టర్లు ఆయా జాబితాలతో వసూలు చేస్తున్నారు. జిల్లాలో సత్తుపల్లి మున్సిపాలిటీ 76.15 శాతం, మధిర 74.91శాతం, వైరా 50.66శాతం చొప్పున ఆస్తి పన్ను వసూలు చేశాయి. వీటిలో సత్తుపల్లి పన్ను వసూళ్లలో ముందంజలో ఉంది.

ప్రత్యేక బృందాలుగా..

ఆస్తిపన్ను వసూలుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. వందశాతం లక్ష్యంగా కార్యాచరణ రూపొందించారు. మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేశారు. ప్రత్యేక బృందాలుగా ఇంటింటికి వెళ్లి ఈ నెల 31లోగా పన్ను చెల్లించాలని అవగాహన కల్పిస్తున్నారు. పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు మున్సిపల్ సిబ్బంది వివరిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు గడువులోగా లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు చేపట్టారు.

విస్తృతంగా ప్రచారం..

పన్ను చెల్లింపుపై మున్సిపాలిటీల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. చెత్త సేకరణ ట్రాక్టర్లతో పాటు ఆటోలతో మైక్‌ల ద్వారా పన్నులు చెల్లించాలని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. అదే విధంగా ప్రధాన కూడలి ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటుతో పన్ను చెల్లింపుపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. కొన్నాళ్ల నుంచి పన్నులు చెల్లించనివారు ముందుకొస్తున్నారు. దీంతో మున్సిపాలిటీలకు ఆదాయం సమకూరుతుంది. అయితే ఆస్తిపన్ను వసూళ్ల వేగాన్ని మరింత పెంచితేనే మున్సిపాల్టీలు లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉంది.

నోటీసులు జారీ చేశాం



మున్సిపాలిటీలో మొండి బకాయిలు 500 మందిని గుర్తించి రెడ్(జప్తు) నోటీసులు జారీ చేశాం. పన్ను చెల్లించకపోతే ఆస్తులు సీజ్ చేస్తాం. ప్రభుత్వ కార్యాలయాలు సైతం పన్ను బకాయిలు చెల్లించాలని నోటీసులు అందించాం. సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి.

– మందా రవిబాబు, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

మున్సిపాలిటీల వారీగా పన్నుల వివరాలు

మున్సిపాలిటీ	డిమాండ్	వసూలు	బకాయి
సత్తుపల్లి	రూ.4.72 కోట్లు	రూ.3.59 కోట్లు	రూ.1.13 కోట్లు
మధిర	రూ.2.57 కోట్లు	రూ.1.93 కోట్లు	రూ. 65 లక్షలు
వైరా	రూ.3.09 కోట్లు	రూ.1.57 కోట్లు	రూ.1.53 కోట్లు

వడ్డీ రాయితీకి స్పందన

ఆస్తిపన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ చేస్తూ పురపాలక శాఖ ఇటీవల ప్రకటించటంతో మున్సిపాల్టీల్లో ప్రజల నుంచి స్పందన లభిస్తోంది. గతేడాది ప్రభుత్వం ఆస్తిపన్ను బకాయిల మొత్తాన్ని పదిశాతం వడ్డీతో ఏకకాలంలో చెల్లించేలా అవకాశం కల్పించింది. తాజాగా తెలంగాణ ప్రభుత్వం పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ పొందే అ వకాశం కల్పించటం పురప్రజలకు ఊరటనిచ్చింది.

కవిత్వ ప్రచురణలో 'సృజన' ముందంజ


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న కవులు

సత్తుపల్లి: కవులు వేదికగా నిలిచిన సృజన సాహితీ సమాఖ్య కవిత్వ ప్రచురణల్లో ముందుంటోందని వక్తలు అన్నారు. ప్రపంచ కవిత దినోత్సవం సందర్భంగా సత్తుపల్లిలో గురువారం ప్రముఖ కవులు రచించిన కవిత్వ రచనలపై సమీక్ష నిర్వహించారు. కాలగమనంలో విస్తృతమైన సాహిత్యాన్ని సృజన ప్రచురించినప్పటికీ కవిత్వమే ప్రధానంగా 12 పుస్తకాలను ప్రచురించినట్లు సృజన బాధ్యులు తెలిపారు. విద్యార్థులు, యువతలో కవిత్వ భావనపై ఆసక్తి కలిగించే విధంగా కవితా రచనల పోటీ నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో బాధ్యులు జి.రామకృష్ణ, గట్టే వాసు, బి.మధుసూదన్‌రాజు, పి.నాగేశ్వరరావు, మాదిరాజు మాలతి, అయ్యదేవర శేషగిరిరావు, రమణమూర్తి, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

24న సంతగుడిలో స్వామివారి కల్యాణం


శ్రీ లక్ష్మీపద్మావతి సహిత వేంకటేశ్వర ఆలయం

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి(సంతగుడి) దేవస్థానంలో ఈ నెల 24న శ్రీలక్ష్మీపద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవాదాయ ధర్మదాయ కార్యానిర్వాహణాధికారి నల్లమోతు శేషయ్య, ఆలయ ఇన్‌చార్జ్ పగడాల మోహన్‌కృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం వారు మాట్లాడుతూ.. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు ఉదయం 10.30గంటలకు స్వామివారి కల్యాణం, సాయంత్రం గ్రామ పురవీధుల్లో ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్‌లోకి సొసైటీ డైరెక్టర్


రమేష్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి: కారేపల్లి సొసైటీ డైరెక్టర్ పోతురాజు రమేష్ బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల పరిధిలోని బాజుమల్లాయిగూడెం గ్రామానికి చెందిన పోతురాజు రమేష్ గత సొసైటీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి డైరెక్టర్‌గా గెలిపొంది ఈ మేరకు కాంగ్రెస్‌లో చేరారు. సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, డైరెక్టర్ కోలేటి రాధాకృష్ణ, బాణోతు రామ్మూర్తి పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

పెనుబల్లి: మండలకేంద్రంలోని పల్లపోతుల సావిత్రి– రామకృష్ణారావు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వీయంబంజర్ రాజసాయి మందిరం నిర్వాహకులు జెన్నారెడ్డి నరసింహారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం మమత మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కంటికి సంబంధించిన అన్ని పరీక్షలు నిపుణులైన వైద్యులు పరిశీలించి, అవసరమైన వారికి ఉచితంగా పరీక్షలు, మందులు అందజేయబడతాయని తెలిపారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సౌందర్యలహరి పారాయణం


పారాయణం చేస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం బుగ్గపాడులోని శ్రీవిశ్వధర్మక్షేత్రంలోని అన్నపూర్ణ సహిత మోక్ష రుద్రేశ్వరస్వామి ఆలయంలో గురువారం అన్నపూర్ణ అమ్మవారికి ప్రత్యేకంగా సౌందర్యలహరి పారాయణం నిర్వహించారు. సత్తుపల్లి హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీవిశ్వధర్మక్షేత్ర వ్యవస్థాపకులు వెల్లటూరి ప్రసాదాచారి, పాలకమండలి అధ్యక్షుడు తుమ్మూరు శ్రీరాంప్రసాద్, శివబాబు, పవన్ పాల్గొన్నారు.

ఫెలోషిప్ కమిటీ ఎన్నిక

బోనకల్: బోనకల్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన మండల కమిటీని స్థానిక వృద్ధాశ్రమంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జి.ప్రవీణ్, అధ్యక్షుడిగా ఎస్.ఏసురత్నం, ఉపాధ్యక్షుడిగా పి.శ్యాం, సెక్రటరీ భరత్, ట్రెజరర్‌గా అబ్రహంలను ఎన్నుకున్నారు. ఈ సందర్భం నూతన కమిటీని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజారత్నం, ఎగ్నేష్ పాల్, మహిళా అధ్యక్షురాలు జీవమ్మ, నియోజకవర్గ సెక్రటరీ డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న సండ్ర వెంకటవీరయ్య

పెనుబల్లి : జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఉప్పలచెలక ఆయన గృహంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కనగాల వెంకట్రావు, మాజీ సర్పంచ్ తావునాయక్, నాయకులు భుక్యా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం


సత్తుపల్లి: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సత్తుపల్లి: సింగరేణి ఆధ్వర్యంలో కిష్టారం ఓసీ ప్రభావిత గ్రామంలో గురువారం జీఎం షాలేం రాజు ఆదేశాల మేరకు మల్టీ స్పెషలిస్ట్ వైద్యులతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కిష్టారం ఓసీ పీఓ ఎం.నర్సింహారావు శిబిరాన్ని ప్రారంభించగా రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సునీతరాజు, రేణుకఈశ్వర్, నాయుడు శ్రీ భరణి, బాలాజీ, విజయసందీప్, నాగమణి, శ్రీను, నాగేశ్వరరావు, చిట్టెమ్మ, మదీన పాల్గొన్నారు.

కొణిజర్ల: మండలంలోని ఎల్లన్ననగర్‌లో గురువారం కొణిజర్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరపీడితులను గుర్తించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రాధాకృష్ణ 51 మందికి రక్త నమూనాలు సేకరించి 15 మందికి జ్వరం లక్షణాలు కనిపించడంతో చికిత్స అందజేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి, పల్లెదవాఖానా వైద్యాధికారులు రాజేష్, తులసి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

- ఫ్లాగ్ మార్చ్‌లో ఏసీపీ ఎం.ఏ రహమాన్


కవాతులో పాల్గొన్న ఏసీపీ ఎం.ఏ రహమాన్, సీఐ నూనావత్ సాగర్, పోలీస్ సిబ్బంది

వైరారూరల్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఏసీపీ ఎం.ఏ రహమాన్ సూచించారు. మండలంలోని గొల్లపూడి, అష్టగుర్తి గ్రామాల్లో గురువారం సీఐఎస్‌ఎఫ్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యాత్మక గ్రామాల్లో నిత్యం పోలీస్ నిఘా ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎవరైనా ఎన్నికల కోడ్ విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ నునావత్ సాగర్, ఎస్సై ఏ.వంశీకృష్ణ భాగ్యరాజ్, సీఐఎస్‌ఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి


సమావేశంలో సూచనలు చేస్తున్న ఆర్డీఓ గణేష్

ముదిగొండ: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని ఆర్డీఓ గణేష్ అధికారులకు సూచించారు. ముదిగొండలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ముదిగొండ మండల సెక్టోరియల్, పోలీస్ అధికారులకు ఎన్నికల నియమావళిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రామారావు, ఎస్‌ఐ గజ్జెల నరేష్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ పి.సూర్యనారాయణ, ఏఓ రాధ, డీఈ రాంబాబు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత


సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి అర్బన్ పార్కు వద్ద అటవీ ఉద్యోగుల ప్రదర్శన


తల్లాడ: ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది

సత్తుపల్లిటౌన్: మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని సత్తుపల్లి ఎఫ్‌డీఓ మంజుల అన్నారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా అటవీ ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అర్బన్‌పార్కు వద్ద జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... రాబోయే తరానికి ఆక్సిజన్ కొరత రాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి బతికించాలని కోరారు. ప్రతీ ఒక్కరు బాధ్యతగా స్వీకరించి పర్యావరణ రక్షణ కోసం పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేంజర్ స్నేహలత, డీఆర్‌ఓలు నసరూబీ, ముత్యాలరావు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడ అటవీ రేంజ్ పరిధిలోని ఫారెస్ట్ సిబ్బంది ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ అమర వీరులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ రేంజ్ అధికారి అరవింద్, డీఆర్‌ఓ శ్రీనివాస్, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం


సర్టిఫికెట్లతో విద్యార్థులు

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ కోర్సులపై శిక్షణ పొందిన విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంపీడీఓ మాధవరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ... విద్యార్థులు కంప్యూటర్‌పై అవగాహన కల్పించేందుకు కళాశాలలో సర్టిఫికెట్ కోర్సుల గురించి శిక్షణ ఇవ్వటం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఏఎల్‌ఎన్ శాస్త్రి మాట్లాడుతూ... కళాశాలలో ఈ నెల 1 నుంచి దాదాపు 20 రోజులు పాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.రవికుమార్, అధ్యాపకులు జి.అరుణ, డాక్టర్ పి.సుజాత, డాక్టర్ వీరన్న, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం


ఎన్నికైన సభ్యులకు పత్రాలు అందజేత

కారేపల్లి: కారేపల్లి మండలం ఎర్రబోడు గ్రామ మత్స్యసహకార సంఘం ఎన్నిక గురువారం ఏకగ్రీవమైంది. ఎర్రబోడు పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో సంఘం అధ్యక్షుడిగా పాయం యాదగిరి, ఉపాధ్యక్షుడిగా వజ్జా శేఖర్, కార్యదర్శిగా కల్తి రామకృష్ణలను ఎన్నుకున్నారు. వీరితోపాటు కమిటీ సభ్యులుగా ఈసాల సునీల్, సపావట్ నాగేశ్వరరావు, వీరస్వామి, కరపటి సమరంకుమార్, కుర్సం రామకృష్ణ, వజ్జా నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఆడిటర్ విశ్వజిత్ వ్యవహరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెనుబల్లి : పెనుబల్లి సబ్‌స్టేషన్ నుంచి 11 కేవీ మండాలపాడు ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ భుజేంద్రకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రామచందర్‌రావు బంజర్, మొండికుంట, మండాలపాడు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు దీనికి సహకరించాలని కోరారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


వేంసూరు: కుంచపర్తిలో పోషణ పక్షోత్సవాల ర్యాలీ


ఎర్రుపాలెం: పోషకాహార స్టాళ్ల పరిశీలన


కల్లూరురూరల్: చంద్రుపట్లలో..

వేంసూరు: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్ వైజర్ భవాని అన్నారు. గురువారం మండల పరిధిలోని కుంచపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్ష వారోత్సవాలు నిర్వహించారు. అదే విధంగా వెంకటపురం సెక్టర్‌లో సూపర్ వైజర్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు.

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని రైతువేదిక కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా తల్లులకు, గర్భిణులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాళ్లను ఐసీడీఎస్ మధిర ప్రాజెక్టు సీడీపీఓ శాంతిశారద, ఏసీడీపీవో జి కృష్ణశ్రీలు పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సరిత, శశి షర్మిలాదేవి, వెంకటరమణ, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ సదాశివరావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జంగా గురునాథరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

కొణిజర్ల: ఐసీడీఎస్ ఖమ్మం రూరల్ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో మండలంలోని తనికెళ్ల రైతు వేదికలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కమలప్రియ, ఏసీడీపీఓలు ఉషారాణి, శివమ్మ, ఎంపీడీఓ రోజారాణి, పల్లె దవాఖానా వైద్యురాలు డాక్టర్ గీత, హెచ్‌ఈఓ జాన్సన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కల్లూరురూరల్: మండలంలోని చంద్రుపట్ల పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణపక్వాడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. ఏఎన్‌ఎం చిట్టెమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.